www.vishalabharati.com
epaper.vishalabharati.com

శనివారం, హైదరాబాద్
01 నవంబర్ 2025
సంపుటి:3 సంచిక: 304

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

## రూ.1,031 కోట్ల బకాయిలు క్లియర్

- ఉద్యోగుల బకాయిలను ఆర్థిక శాఖ క్లియర్ చేసింది
- డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాల మేరకు నిర్ణయం
- ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లు
- రూ.10 లక్షలలోపు పెండింగ్ బిల్లులు
- ఆర్ అండ్ బికి సంబంధించి రూ.320 కోట్లు
- పాఠశాలల బకాయిలపై కీలక నిర్ణయం

03



శాసనాలు చేసే నేతలే

# చట్టాలకు తూట్లు




### ప్రముఖ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆగడాలకు హద్దు లేదు

అధికార పార్టీ నేతల కన్ను ప్రభుత్వ భూములపై
కోట్ల విలువైన భూములకు రక్షణేదీ
అధికారముంటే అన్నీ మాఫియేనా..
మాకైతే రిజిస్ట్రేషన్ అయ్యింది అంతే..
ప్రభుత్వ భూమి ఉంటే మాకేంటీ
అంటూ నిర్లక్ష్య సమాధానం
అధికారులు అందినకాడికి దోచుకోని మౌనం

02

## నాన్చొంచెం టైమ్ ఇవ్వండి ప్లీజ్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసు
- మూడు నెలల గడువు ముగిసింది
- ఆరుగురు ఎమ్మెల్యేల విచారణ పెండింగ్
- 8 వారాల సమయం కోరిన స్పీకర్
- వీరిపై అనర్హత వేటు వేయాలంటున్న బీఆర్ఎస్
- సుప్రీంకోర్టు త్వరలో విచారణ జరుపనుంది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ అసెంబ్లీలో 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులపై సుప్రీంకోర్టు నిర్ణయించిన మూడు నెలల గడువు ముగిసింది. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. జూలై 31న సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల ప్రకారం, అంటిడిఫెక్షన్ చట్టం కింద దాఖలైన పిటిషన్లపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌కు ఆదేశించింది. ఆరుగురు ఎమ్మెల్యేల విచారణ షెడ్యూల్ ఇంకా విడుదల చేయలేదు. మిగతా విచారణలకు మరో రెండు నెలల (8 వారాల) సమయం కోరుతూ సుప్రీంకోర్టును స్పీకర్ అభ్యర్థించారు . 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌లోంచి కాంగ్రెస్‌లోకి పది మంది ఫిరాయించారు. వీరిపై అనర్హతా

మిగతా 2లో..

## అజార్ కొత్త ఇన్నింగ్స్

### తెలంగాణ కేబినెట్ మంత్రిగా అజారుద్దీన్

- పదవి ప్రమాణ స్వీకారం చేశారు
- గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు
- ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీగా ఎన్నిక కావాలి
- కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు
- మంత్రుల సంఖ్య 16కు చేరుకుంది



02

## సెంటిమెంట్ పేరుతో అభివృద్ధిని ఆపుకోవద్దు

- జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు
- నవీన్ యాదవ్ తరపున రోడ్ షోలో పాల్గొన్నారు
- నవీన్ యాదవ్‌ని భారీ మెజారిటీతో గెలిపించండి

03



## హాలీవుడ్ రేంజ్‌లో తెలంగాణ ఫిల్మ్ హబ్

హాలీవుడ్ స్థాయికి రాష్ట్రాన్ని తీసుకెళ్లాలి
మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
మహారాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రితో సమావేశం
రాష్ట్రాల మధ్య సినిమా పరిశ్రమ అభివృద్ధి
ప్రభుత్వం సినిమా రంగాన్ని ప్రోత్సహిస్తుంది
పరిశ్రమకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణను హాలీవుడ్ స్థాయి ఫిల్మ్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో మహారాష్ట్ర ఐటీ, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి ఆశిష్ శెలార్‌తో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు రాష్ట్రాల మధ్య సినిమా పరిశ్రమ అభివృద్ధి, పాలసీ రూపకల్పన, సహకార కార్యక్రమాలు

మిగతా 2లో..





## సీఎం భరోసా..

- తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- బాధితులను పరామర్శించిన సీఎం
- ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 5 లక్షలు
- ఎకరా పంట నష్టానికి రూ.10వేలు ఆర్థిక సాయం
- ఇల్లు మునిగిపోయిన ప్రతి ఇంటికి రూ. 15,000
- 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు
- ఇండ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు
- గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు
- నాలాలపై కబ్జాలను తొలగించాల్సిందేనని అన్నారు

03

## తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

- రాష్ట్రంలో ఐఏఎస్ అధికారులు బదిలీ
- ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల బదిలీ
- ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు
- కీలక విభాగాల్లోకి అనుభవజ్ఞులైన అధికారులు
- ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్
- కే.ఇలంబర్తిని ప్రభుత్వం మళ్లీ బదిలీ చేసింది

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** తెలంగాణ ప్రభుత్వంలో పరిపాలనలో పారదర్శకతను తీసుకొస్తూ.. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అత్యంత వేగంగా అమలు చేయడం లక్ష్యంగా ఎనిమిది మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు, పదోన్నతులు చేపట్టింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పలు

మిగతా 3లో..



# సీఎం భరోసా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊరట కలిగించే వార్త చెప్పారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం చెల్లించనున్నట్టుగా ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం రోజున ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలలో తుపాను ప్రభావిత ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం వరంగల్‌లో వరద ముంపు ప్రాంతాలను పరిశీలించారు. సమ్మయ్య నగర్, కాపువాడ, పోతననగర్ తదితర ప్రాంతాల్లో వరద బాధితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం తుపాను కారణంగా జరిగిన నష్టంపై హనుమకొండ కలెక్టరేట్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై అన్ని శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో నివేదికలు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన రిపోర్ట్‌స్‌ను కలెక్టర్లకు ఇవ్వాలని తెలిపారు.

తుఫాన్ నష్టంపై కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాల్సి ఉందని అన్నారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో అలసత్వం వద్దని అధికారులకు సూచించారు. కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాబట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. అయితే భారీ వర్షాలు, వరదల కారణంగా ఏర్పడుతున్న సమస్యలకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని చెప్పారు. నాలాలపై కబ్జాలను తొలగించాల్సిందేనని... ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పది మంది కోసం పదివేలమందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించొద్దని చెపప్పారు. దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్లాల్సిందేనని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు, వరద తగ్గినందున శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

భారీ వర్షాలు, వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షలు పరిహారం అందిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించారు. పంటనష్టం, పశు సంపద నష్టపోయిన చోట వారికి పరిహారం అందించాలని చెప్పారు. ఇల్లు మునిగిపోయిన ప్రతి ఇంటికి రూ. 15,000 ఆర్థిక సహాయం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్ స్మార్ట్ సిటీలో చేయాల్సిన పనులపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఒక కోఆర్డినేషన్ కమిటీ వేసుకుని పనిచేయాలని సూచించారు. కలెక్టర్లు ఫీల్డ్ విజిట్స్ చేయాల్సిందేనని తెలిపారు. సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయని అన్నారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. నాలాలపై కబ్జాలను తొలగించాల్సిందేనని... ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పది మంది కోసం పదివేలమందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించొద్దని చెపప్పారు. దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందుకు వెళ్లాల్సిందేనని ఆదేశించారు. ప్రస్తుతం వర్షాలు, వరద తగ్గినందున శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

# రూ.1,031 కోట్ల బకాయిలు క్లియర్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు అక్టోబర్ నెలకు సంబంధించిన ఉద్యోగుల బకాయిలను ఆర్థిక శాఖ క్లియర్ చేసింది. ఉద్యోగుల బకాయిలతో పాటు ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులను క్లియర్ చేసినట్లు ఆర్థిక శాఖ అధికారులు ప్రకటించారు. ఈ మేరకు సుమారు రూ.1,031 కోట్లను విడుదల చేసినట్లు వెల్లడించారు. శుక్రవారం ఉదయం ప్రజా భవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ కు ఆదేశాలు జారీ చేశారు.గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను దశలవారీగా ప్రతినెలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లియర్ చేస్తూ వస్తున్నారు. అందులో భాగంగా అక్టోబర్ మాసానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా రూ.10 లక్షల లోపు పెండింగ్ లో ఉన్న బిల్లులను క్లియర్ చేయాలని ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది.

ఇందులో భాగంగా పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశం మేరకు అధికారులు విడుదల చేశారు. రోడ్లు - భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షల లోపు విలువగల 3,610 బిల్లులకు సంబంధించిన రూ.95 కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీ రాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లులకు సంబంధించి రూ. 225 కోట్ల రూపాయలను సైతం విడుదల చేశారు.

రాష్ట్రంలో గురుకులాలు, కేజీబీవీ పాఠశాలల, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ బకాయిలపై రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. ప్రజాభవన్ లో ఆర్థిక శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో గిరిజన సంక్షేమ నివాస పాఠశాలలు, గిరిజన, జనరల్ గురుకులాలు, కేజీబీవీ పాఠశాలలు విద్యార్థుల భోజన ఛార్జీలు, అద్దె చార్జీలు, కాస్మోటిక్ చార్జీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులపై చర్చించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని అన్ని రకాల బిల్లులు సుమారు రూ.92 కోట్లు వెనువెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు.

ప్రజా ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తూచా తప్పక పాటించాలని, మెనూ పాటిస్తున్నారా లేదా, వసతి సౌకర్యాలు, బోధనలు నాణ్యత వంటి విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు అధికారులు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ప్రభుత్వ గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, కేజీబీవీలను సందర్శించాలని డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. డిప్యూటీ సీఎం ఆదేశంతో ఆయా పాఠశాలల బిల్లులన్నీ తక్షణం క్లియర్ అయ్యేలా అధికారులు చర్యలు ప్రారంభించారు. ప్రజాప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని విద్యాసంస్థలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదని ప్రజాప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది అన్నారు. ఈ నేపథ్యంలోనే గత ప్రభుత్వంలో ఉన్న బకాయిలతో పాటు తాజా బకాయిలను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ వస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

# తెలంగాణలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ

**( మొదటిపేజీ తరువాయి )**

ఫ్లాగ్‌షిప్ అభివృద్ధి కార్యక్రమాల సమర్థవంతమైన అమలుకు అనుభవజ్ఞులైన అధికారులను కీలక విభాగాల్లో నియమించింది. ఫ్లాగ్ షిప్ అభివృద్ధి, సంక్షేమ పనుల అమలు విభాగం ప్రత్యేక సీఎస్‌గా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. అంతే కాకుండా.. సంక్షేమశాఖ ప్రత్యేక సీఎస్‌గానూ ఆయన కొనసాగనున్నారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఉన్న కే. ఇలంబర్తికి పశుసంవర్ధకశాఖ కార్యదర్శి హోదాలో అదనపు బాధ్యతలు అప్పగించారు. గిరిజన సంక్షేమ కార్యదర్శి, కమిషనర్‌గా కొనసాగుతున్న అనితా రామచంద్రన్‌కు కూడా అదనపు బాధ్యతలు అప్పగించారు. మెట్రోపాలిటన్ అర్బన్ డెవలప్మెంట్ కార్యదర్శి బాధ్యతలను సీఎస్ వద్దే ఉంచారు.

జీఏడీ (సామాన్య పరిపాలన) శాఖ కార్యదర్శిగా ఇ. శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా.. ఆయిల్‌ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషా కొనసాగుతూ ఆ పదవికి సంబంధించిన అదనపు బాధ్యతలు కూడా ఆమెకే అప్పగించారు. ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా జి. జితేందర్ రెడ్డిని నియమించి ఆయనకు ఎస్సీ సహకార సంస్థ ఎండీ బాధ్యతలు కూడా కల్పించారు. వీటితో పాటు.. సాంఘిక సంక్షేమ పథకాల ప్రత్యేక కార్యదర్శిగా సైదులుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. ఈ బదిలీలు.. బాధ్యతల పునర్విభజన ద్వారా రాష్ట్రప్రభుత్వం పరిపాలనలో సమతుల్యతను తీసుకురావడమే కాకుండా.. ముఖ్య పథకాల అమలులో వేగం పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా సంక్షేమ, పశుసంవర్ధక, గిరిజన అభివృద్ధి, రవాణా, నగరాభివృద్ధి వంటి విభాగాలు ప్రజల దైనందిన జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే రంగాలు కావడంతో.. ఈ నియామకాలు కీలకమవుతున్నాయి. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్ మెంట్ కార్యదర్శి గా ఆరు నెలలు ముగియక ముందే కే.ఇలంబర్తిని రాష్ట్రప్రభుత్వం బదిలీ చేసింది. ఆయనను రవాణా కమిషనర్ గా నియమిస్తూ శక్రవారం నాడు ఉత్తర్వులు జారీ అయ్యాయి. మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్ మెంట్ డిపార్ట్ మెంట్ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు కు అప్పగించారు. హెచ్ఎండీఏ పరిధిలో ఫైళ్లను ఇలంబర్తి త్వరగా పరిష్కరించకుండా పెండింగ్ లో పెట్టడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహంతో ఉన్నట్లు సచివాలయంలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. నెలల కొద్దీ ఫైళ్లపై సంతకాలు పెట్టకుండా నిర్లక్ష్యం చేయడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆచితూచి వ్యవహరించడం కూడా కారణంగా చెబుతున్నారు. ఇక్కడకు రాక ముందు ఆయన గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్ గా నియమించింది. అక్కడ కూడా ఇదే రీతిన వ్యవహరించడంతో బదిలీ చేసి సచివాలయంలోని మెట్రోపాలిటన్ ఏరియా అండ్ అర్బన్ డెవలప్ మెంట్ డిపార్ట్ మెంట్ కార్యదర్శి గా నియమించిన విషయం తెలిసిందే. జీహెచ్ఎంసీ కమిషనర్ గా 2024 అక్టోబర్ 17 నుంచి 2025 ఏప్రిల్ నెలాఖరు వరకు పనిచేశారు. అక్కడ కూడా ఏడు నెలలకు మించి పనిచేయలేదు. ముక్కు సూటి అధికారి గా పేరున్న ఆయన వివాదాస్పద ఫైళ్ల విషయంలో సాచివేత వైఖరి అవలంబించడం మూలంగానే బదిలీ చేసినట్లు అప్పట్లో వార్తలొచ్చాయి.

# మావోల వద్ద 400 కేజీల బంగారం?

- కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆపరేషన్ కగార్
- ముఖ్య మావోయిస్టు నేతలు లొంగిపోతున్నారు
- ఈ క్రమంలో అనుమానాలు తెర మీదకు వస్తున్నాయి
- ఇన్నాళ్లు మావోయిస్టులు సేకరించిన నగదు ఎక్కడ
- డంపుల మాటేమిటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి
- దాదాపు 400 కేజీల బంగారం ఉన్నట్లు కథనాలు
- రూ.400 కోట్ల నిధులు ఉంటాయని అంచనా

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



ఆపరేషన్ కగార్ వల్ల ముఖ్య మావోయిస్టు నేతల నుంచి సాధారణ దళ సభ్యుల వరకు చాలా మంది లొంగి పోతున్నారు. ప్రస్తుతం దేశంలో మావోయిస్టుల సంఖ్య తగ్గుతున్న తరుణంలో అనేక ప్రశ్నలు, అనుమానాలు తెర మీదకు వస్తున్నాయి. వాటిల్లో ముఖ్యమైనవి ఇన్నాళ్లు మావోయిస్టులు సేకరించిన కోట్ల రూపాయల నగదు , ఆస్తులు ఎక్కడ.. ఎవరి ఆధీనంలో ఉన్నాయి.. డంపుల మాటేమిటి అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వీటితో పాటు మరో ఆసక్తికర వార్త తెగ ప్రచారం అవుతోంది. అది ఏంటంటే.. మావోయిస్టులు సేకరించిన వందల కోట్ల రూపాయల నగదును కరోనా సమయంలో బంగారం రూపంలోకి మార్చారని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. మావోల వద్ద దాదాపు 400 కేజీల బంగారం ఉన్నట్లు కథనాలు వస్తున్నాయి. మరి ఇదంతా ఎక్కడ ఉంది.. ఎలా భద్రపరిచారు అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇది నిజమో కాదో కూడా పూర్తి వివరాలను ప్రభుత్వం తెలిజేయాల్సి ఉంది.

గతంలో మావోలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఒడిశా, మహారాష్ట్ర, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్‌లోని కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తల నుంచి భారీ స్థాయిలోపార్టీ ఫండ్ వసూలు చేశారు. ఆ మొత్తాన్ని కేంద్ర కమిటీకి పంపిస్తుంటారు. అలానే మావోయిస్టు పార్టీకి నిధుల సేకరించేందుకు గాను పెద్ద స్థాయిలో నెట్ వర్క్ ఉందన్న విషయం జాతీయ విచారణ సంస్థ(ఎన్ఐఏ) దర్యాప్తులో వెలుగు చూసింది. ఇప్పుడు మావోయిస్టులకు నిధులు అందకుండా పూర్తి స్థాయిలో కట్టడి చేసినా సరే వారి వద్ద ఉన్న నిధులతో మరో ఐదారు సంవత్సరాలు పార్టీని నడపొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. కానీ అప్పటి వరకు మావోలు బతికి ఉండే అవకాశం లేక.. వరుసగా లొంగిపోతున్నారు.

మావోయిస్టులు తమకు అందిన డబ్బును రెండు రకాలుగా మార్చినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. ప్రధానంగా పార్టీ సానుభూతిపరులు,వారి కుటుంబ సభ్యులు, బంధువుల పేరటి బ్యాంక్ అకౌంట్స్ తెరిచి వాటిల్లో డిపాజిట్ చేయడంతో పాటు.. కొందరి పేరు మీద కంపెనీలు.. మరి కొన్ని సార్లు డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు జమ చేశారని తెలుస్తోంది. మిగిలిన నగదును బంగారం రూపంలోకి మార్చేశారని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ దగ్గర.. దాదాపు రూ.400 కోట్ల నిధులు ఉంటాయని నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. అలానే 400 కేజీల బంగారం నిల్వలు కూడా ఉండొచ్చని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. ఆ బంగారం అంతా అడవుల్లోని డంపుల్లో ఉందా.. లేదంటే బయట ఎక్కడైనా దాచారా అనే అనే అంశంపై కేంద్ర, రాష్ట్ర నిఘా వర్గాలు దృష్టి సారించాయి. ఇప్పటికే ఈడీ అధికారులు పలు రాష్ట్రాల్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించగా.. వారితో పాటు వారి కుటుంబ సభ్యుల ఖాతాలో భారీ ఎత్తున నగదు డిపాజిట్ చేసినట్లు గుర్తించారు. అలానే లొంగిపోతున్న మావోయిస్టుల తమ దగ్గర ఉన్న ఆయుధాల గురించే కాక నగదు గురించి కూడా లెక్కలు చెప్పాకే బయటకు వస్తున్నారని తెలుస్తోంది.

# కీసర గుట్టకు రానున్న విధుశేఖర భారతీ మహా స్వామి

**కీసర, విశాలభారతి :** ఆదివారం కీసర గుట్టకు రానున్న శ్రీ శ్రీ శ్రీ జగద్గురు విధుశేఖర భారతీ మహా స్వామి.ఈ సంధర్భంగా ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ పత్రిక సమావేశంలో మాట్లాడుతూ కార్తీక మాసం రెండోవ ఆదివారం వస్తున్న నేపథ్యంలో కీసర గుట్టకు వచ్చే భక్తులకు మనవి ఏమనగా స్వామి వారి అభిషేకాలు ఉదయం ఆరు గంటల వరకు జరుగుతాయి మళ్ళీ అభిషేకాలు మళ్ళీ పదకొండు గంటలకు జరుగుతాయి అని తెలిపారు.ఈ మధ్యలో ఐదు గంటలు శ్రీ శ్రీ శ్రీ జగద్గురు విధిశేఖర స్వామి రామలింగేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేయనున్నారు అని తెలిపారు.కావున కీసర గుట్టకు శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామి ఆలయనికి వచ్చే భక్తులు సహకరించాలి అని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈ ఓ సుధాకర్ రెడ్డి,ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# 'ఏక్తా రన్'లో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపిఎస్

**ఉప్పల్, విశాలభారతి:** రాష్ట్రీయ ఏక్తా దివాస్ సందర్భంగా రాచకొండ కమిషనరేట్ పోలీసులు రన్ ఫర్ యూనిటీను రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ఎవరెస్ట్ అధిరోహించిన అన్విత రెడ్డి,అథ్లెంటిక్ కల్పన రెడ్డిలు జెండా ఊపి రన్ ప్రారంభించారు. ఉప్పల్ రింగ్ రోడ్ నుంచి ఉప్పల్ క్రికెట్ స్టేడియం వరకు 2k రన్ నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. భారతదేశంలో ఉన్న పౌరులు అందరూ ఏకతాటిపై ఉన్నారు అని తెలియజేయడానికి రన్ ఫర్ యూనిటీ అని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచకొండ పోలీసు ఉన్నతాధికారులు, డీసీపీ మల్కాజిగిరి పద్మజ ఐపిఎస్, డీసీపీ క్రైమ్స్ అరవింద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# వల్లభాయ్ పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

**తొర్రూరు, విశాలభారతి:** బ్రిటిష్ చెర నుండి దేశం విముక్తి చేసిన అనంతరం పలు సంస్థానాలను భారత్ లో భాగం చేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని, ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని మేరా భారత్ జిల్లా యూత్ కోఆర్డినేటర్ బానోతు వీరన్న నాయక్ తెలిపారు.దేశ తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని మేరా యువ భారత్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులచే సమగ్రత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరన్న నాయక్ మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత పట్ల ఆయన దూరదృష్టి, సాహసం, స్వాతంత్ర్యం సిద్ధించిన తొలినాళ్లలో పలు విపత్కర సమస్యలను ఎదుర్కొని దేశాన్ని ముందుకు నడిపించిన విధానాన్ని ప్రజలందరూ ఇప్పటికీ గుర్తుచేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బరిగెల నారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# సెంటిమెంట్ పేరుతో అభివృద్ధిని ఆపుకోవద్దు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**





తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్, బీజేపీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. జూబ్లిహిల్స్ ఉపఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున యూసుఫ్‌గూడ నుండి వెంగళ్‌రావు నగర్ వరకు జరిగిన భారీ రోడ్ షోలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా తనకు అండగా నిలిచిన వేలాది మంది కార్యకర్తలకు, మద్దతు తెలిపిన మహిళలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈసారి జూబ్లీహిల్స్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ 'సెంటిమెంట్' పేరుతో ఓట్లు అడగడాన్ని ముఖ్యమంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సూటిగా ప్రశ్నించారు. "2007లో పేదల దేవుడు, ఖైరతాబాద్ శాసనసభ్యుడు పి.జనార్ధన్ రెడ్డి (పీజేఆర్) అకాల మరణం చెందినప్పుడు, కాంగ్రెస్‌కు బద్ధ శత్రువులైన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, బీజేపీ నేతలు సైతం రాజకీయ వైరాన్ని పక్కనపెట్టి పీజేఆర్ కుటుంబానికి గౌరవంగా ఉప ఎన్నికను ఏకగ్రీవం చేయడానికి సహకరించారు. కానీ ఆనాడు కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ మాత్రం ఆ మంచి సంప్రదాయాన్ని తుంగలో తొక్కి, పీజేఆర్ కుటుంబంపై అభ్యర్థిని నిలబెట్టి దుష్ట సంప్రదాయానికి తెరలేపింది వాస్తవం కాదా?" అని రేవంత్ రెడ్డి నిలదీశారు. ఆనాటి ప్రత్యక్ష సాక్షి, పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి ఇక్కడే ఉన్నారని గుర్తుచేశారు. పేదల దేవుడైన పీజేఆర్ కుటుంబాన్నే అవమానించిన బీఆర్ఎస్‌కు ఈరోజు సానుభూతి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని ఆయన విమర్శించారు. ఈ ఉప ఎన్నిక సెంటిమెంట్‌కు, అభివృద్ధికి మధ్య జరుగుతున్న పోరాటమని సీఎం అభివర్ణించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికను ఆయన ఉదాహరణగా చూపారు. "అక్కడ కూడా బీఆర్ఎస్ సానుభూతిని నమ్ముకుంది, కానీ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు. శ్రీ గణేష్‌ను గెలిపిస్తే, కేవలం కొద్ది నెలల్లోనే 4000 కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించి, 3040 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మేడ్చల్, షామీర్‌పేట ఎలివేటెడ్ కారిడార్ పనులను, తాగునీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్నాడు" అని తెలిపారు. జూబ్లీహిల్స్ ప్రజలు కూడా అభివృద్ధిని కోరుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో 2014, 2018, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థినే గెలిపించినా జూబ్లీహిల్స్ ప్రజలకు ఏం ఒరిగిందని సీఎం ప్రశ్నించారు. "ఆనాడు ఎమ్మెల్యే వారిదే, మున్సిపల్ మంత్రి వారిదే, ముఖ్యమంత్రి వారిదే. అయినా మీ ప్రాంత సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదు? ఆనాటి మంత్రులు, ముఖ్యమంత్రి ఎప్పుడైనా మీ బస్తీలకు వచ్చారా? ఇక్కడి సినిమా కార్మికుల సమస్యలను పట్టించుకున్నారా? వెంగళ్‌రావు నగర్ బస్తీలోని ఇళ్లపై నుంచి వెళ్తున్న హైటెన్షన్ వైర్లను తొలగించాలని మూడుసార్లు గెలిచిన ఎమ్మెల్యే ఒక్కరోజైనా అసెంబ్లీలో మాట్లాడారా?" అని ఆయన నిలదీశారు.

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బీజేపీలపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. "హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేస్తుంటే, మెట్రో రైలు విస్తరణకు, మూసీ నది అభివృద్ధికి కిషన్ రెడ్డి అడ్డం పడుతున్నారు. రేవంత్ రెడ్డికి మంచి పేరు వస్తుందనే భయంతో బీఆర్ఎస్‌తో కుమ్మక్కై అభివృద్ధిని అడ్డుకుంటున్నారు" అని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎనిమిది స్థానాల్లో డిపాజిట్లు కోల్పోయి, తన ఓట్లను బీజేపీకి బదిలీ చేసి గెలిపించిందని, ఇది వారి 'రహస్య బంధానికి' నిదర్శనమన్నారు. "రెండుసార్లు మంత్రిగా, ఎంపీగా గెలిచిన కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేంద్రం నుంచి 'బుడ్డ పైసా' అయినా తెచ్చారా?" అని ప్రశ్నించారు. ఉప ఎన్నికల కోసం బీజేపీ 'కార్పెట్ బాంబింగ్' (కేంద్ర మంత్రులను దించడం) చేస్తుందన్న వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, "జూబ్లీహిల్స్‌పై బాంబులు వేస్తారా? అభివృద్ధి చేయాలనుకోవాలి కానీ, విధ్వంసం కాదు" అని అన్నారు. మోడీ, కేసీఆర్ పాలనలో పేదలకు రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, సన్న బియ్యం అందలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యారెంటీలను అమలు చేస్తోందని సీఎం అన్నారు. ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి, "మా ఆడబిడ్డలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తూ, ఇంటాయన ముందు చేయి చాపకుండా పనులు చేసుకుంటున్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి ఈ పథకాన్ని బంద్ పెట్టించాలని చూస్తున్నారు" అని ఆరోపించారు. "బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే, మీ పిల్లలకు అందుతున్న సన్న బియ్యం, ఉచిత కరెంట్, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం అన్నీ రద్దయిపోతాయి" అని హెచ్చరించారు.

అభివృద్ధికి నవీన్ యాదవ్‌ను గెలిపించండి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, పేదల కోసం పనిచేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. "జూబ్లీహిల్స్‌కు సెంటిమెంట్ కాదు, అభివృద్ధి కావాలి. చదువుకున్న యువకుడు, మీ బిడ్డ నవీన్ యాదవ్ ను గెలిపించండి. అతను అసెంబ్లీలో మీ గొంతుక అవుతాడు. మీ సమస్యల కోసం పోరాడుతాడు. ప్రభుత్వాన్ని నిలదీసి మీ పనులు చేయిస్తాడు" అని పిలుపునిచ్చారు. రెండు నెలల్లో మంత్రులు తిరిగి వచ్చి అభివృద్ధి పనులపై సమీక్ష చేస్తారని హామీ ఇచ్చారు.





# రైతులపై చిన్న చూపేందుకు ? కవిత

- మత్తడి బాగు చేసేందుకు మూడేళ్లా?
- సాగునీరు లేక రైతుల ఆవేదన
- ప్రభుత్వ నిర్లక్ష్యంపై జాగృతి అధ్యక్షురాలు మండిపాటు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**





రైతుల ఇబ్బందులను పరిష్కరించడంలో చిన్న చూపేందుకు అనీ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. కల్వల మత్తడి పునర్నిర్మాణం జాప్యంతో వేలాది మంది రైతులకు సాగు నీరు అందడం లేదన్నారు. మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాకపోవడం రైతులపై నిర్లక్ష్యానికి నిదర్శనం అని ఆమె విమర్శించింది. శుక్రవారం శంకరపట్నం మండలంలో జరిగిన జాగృతి జనంబాట కార్యక్రమంలో రైతులతో కవిత పరామర్శించింది.

**ప్రమాదంలో ఆరు వేల ఎకరాలు**

"మత్తడి కొట్టుకుపోయి మూడు సంవత్సరాలు అవుతోంది. అప్పటి ప్రభుత్వం రూ.70 కోట్లు మంజూరు చేసింది. కానీ కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి. ఫలితంగా దాదాపు ఆరు వేల ఎకరాలకు నీరు అందడం లేదు. రైతులు అప్పుల బారిన పడుతున్నారు," అని ఆమె పేర్కొంది.

**ఎకరాకు 50వేల పరిహారం**

"తుపానుతో పంటలు నాశనం అయినా పరిహారం ఇవ్వడంలో ప్రభుత్వం వివక్ష చూపుతోంది. వరంగల్, ఖమ్మం రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ప్రకటిస్తే, కరీంనగర్ రైతులకు మాత్రం మాటలు మాత్రమే. కనీసం ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి," అని కవిత డిమాండ్ చేసింది.

**ముదిరాజ్ కుటుంబాలకు మత్తడే జీవనాధారం...**

"ఈ మత్తడి పునరుద్ధరణ ఆలస్యం కారణంగా ముదిరాజ్ కుటుంబాలు జీవనోపాధి కోల్పోతున్నాయి. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి. నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయకపోతే రైతులు ఆత్మహత్యల దారిలోకి వెళ్లే పరిస్థితి వస్తుంది," అని ఆమె హెచ్చరించింది. మత్తడి పనుల్లో ప్రభుత్వం నిర్లక్ష్యం, పరిహారం విషయంలో వివక్ష — ఇవే రైతుల ఆవేదనకు కారణమని కవిత వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

## బీజపూర్ జాతీయ రహదారికి తొలగిన అడ్డంకులు



- తక్షణమే రోడ్డు పనులు ప్రారంభం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి, కాలె యాదయ్య

**విశాల భారతి- చేవెళ్ల :**

చేవెళ్లబీజపూర్ జాతీయ రహదారికి విస్తరణ పనులకు అడ్డంకుగా మారిన కోర్ట్ కేసులు తొలగిపోయాయిని వెంటనే పనులు ప్రారంభం అవుతాయిన్ని ఎమ్మెల్యే లు రామ్మోహన్ రెడ్డి, కాలె యాదయ్యలు అన్నారు. చేవెళ్ల పట్టణకేంద్రంలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో పరిగి ఎమ్మెల్యే డా "టి. రామ్మోహన్ రెడ్డి,చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యలు మాట్లాడుతూ సుమారు 1000 కోట్ల రూపాయలతో ప్రభుత్వం మంజూరు చేసినటువంటి అప్పా జంక్షన్ నుండి మన్నేగూడ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మించడానికి గ్రీన్ ట్రిబ్యునల్ లో పర్యావరణ ప్రేమికులు వేసి నటువంటి కేసును శుక్రవారం 10.30 నీ.లకు చెన్నై కోర్టులో విచారణలో నేషనల్ హైవే అథారిటీ వారు రోడ్డుకు ఇరువైపు గల 950 చెట్లను కాకుండా కేవలం నూట యాభై చెట్లను మాత్రమే తొలగించి వేరే ప్రాంతంలో నాటడానికి నిర్ణయించినట్టు కోర్టుకు తెలపడం జరిగిందిన్నారు. ఈ నిర్ణయాని పిటిషనర్లు ఒప్పుకోవడంతో పిటిషనర్లకు మరియు ఎన్‌ఎచ్ వారికి మధ్య రోడ్డు నిర్మించడానికి ఉన్నటువంటి స్టే ఆర్డర్ను కోర్టు ఎత్తివేయడం జరిగిందిన్నారు. తక్షణమే రోడ్డు పనులను ప్రారంభించడానికి అనుమతి ఇచ్చిందిన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి శుక్రవారం ఉదయం తీసుకువెళ్లడంతో వారు నేషనల్ హైవే అధికారులను పనులు వెంటనే ప్రారంభించడానికి ఆదేశించారని ఈరోజు పనులు ప్రారంభంఅవుతాయి అన్నారు. ఈరోజు నుండి నిర్విరామంగా ఈ హైవే పనులు కొనసాగుతాయని సాధ్యమైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేసి ఈ ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా అరికడతామన్నారు. గత కొన్ని రోజుల నుండి సుమారు 300 మంది ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయారని రాబోయే రోజుల్లో ఈ సమస్య తీరి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుందిన్నారు. అదేవిధంగా త్రిబుల్ ఆర్ రోడ్డు మరియు రేడియం రోడ్లు మరియు హం పథకం ద్వారా ప్రతి గ్రామాల్లో బీట్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుందిన్నారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్ రెడ్డి,ఆగిరెడ్డి, దేవర వెంకట్ రెడ్డి,గోనె ప్రతాప్ రెడ్డి,పాండు యాదవ్,వీరేందర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్,గోపాల్ రెడ్డి, మధుసూదన్ గుప్తా,పడాల ప్రభాకర్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది



- రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు, ఐపీఎస్
- పదవీ విరమణ పొందిన సబ్ ఇన్స్పెక్టర్లను సత్కరించిన కమిషనర్

రాచకొండ , విశాలభారతి: పోలీస్ కమిషనరేట్ లో పనిచేస్తూ పదవీ విరమణ ఐదుగురు సబ్ ఇన్స్పెక్టర్లు మహిపాల్ రెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్ పీఎస్, రవీంద్ర రెడ్డి, పోలీస్ కంట్రోల్ రూమ్, లాలయ్య, పోలీస్ కంట్రోల్ రూమ్, రాజేశ్వర్, హయత్ నగర్ పీఎస్ మరియు ఆనంద్ నాయక్, యాదగిరిగుట్ట పీఎస్ లను సీపీ సుధీర్ బాబు, ఐపీఎస్ రాచకొండ పోలీస్ కార్యాలయంలో సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని, విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ఎంతో కాలం పాటు పోలీసుశాఖలో సమర్థవంతంగా, క్రమశిక్షణతో పనిచేసి తమ సేవలు అందించినందుకు అభినందించారు. పదవీ విరమణ అనంతరం విశ్రాంత జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని, ఆరోగ్యం పట్ల అధిక శ్రద్ధ చూపాలని, పెన్షన్ మరియు ఇతర ఆర్థిక అంశాల పట్ల క్రమశిక్షణ పాటించాలని సూచించారు. వారికి రావాల్సిన అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ ఇందిరా, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివ కుమార్, సీసీఆర్బీ ఏసిపి రమేష్, CAO అడ్మిన్ పుష్పరాజ్, AAO అశోక్ రెడ్డి, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు సిహెచ్. భద్రా రెడ్డి, కో ఆపరేటివ్ డైరెక్టర్ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత గుడికి భూమి పూజ విగ్రహ ప్రతిష్ట



**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం రామరాజు పల్లి గ్రామంలో దుర్గామాత ఆలయ నిర్మాణానికి మొదటి అడుగు పడింది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బండి సిద్దయ్య తండ్రి చంద్రయ్య దాదాపు 450 గజాల 4 లక్షల విలువ చేయు స్థలాన్ని దాతృత్వంగా దానం చేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో భూమి పూజ కొద్ది రోజుల క్రితం ఘనంగా జరిగింది. అనంతరం దుర్గామాత విగ్రహ ప్రతిష్ట ఏర్పాటుకు ఈరోజు గ్రామస్తులు ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఇంటింటికి పసుపు నీళ్లతో వేప కొమ్మలతో, అలంకరించి, బిందెలతో గ్రామంలోని బొడ్రాయికి, ప్రతిష్టించిన దుర్గామాత విగ్రహానికి ఆ నీరు పోసి ఘనంగా ప్రత్యేక పూజారితో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం శుభ కార్య వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, మా గ్రామంలో దుర్గామాత దేవాలయం నిర్మించాలనే కోరికను నెరవేర్చినందుకు స్థలం ఇచ్చిన బండి సిద్దయ్య కుటుంబానికి హృదయపూర్వక ధన్యవాదములు అని తెలిపారు.

## అకాల వర్షంతో నష్టపోయిన రైతన్న

**నేలకొరిగిన వరి పంట**



**తొర్రూర్, విశాలభారతి:** తొర్రూరు మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షాలు రైతులను తీవ్రంగా దెబ్బతీశాయి. తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షం కారణంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు నేలమట్టమయ్యాయి.గాలి భారీ వర్షం వల్ల వరి పొలాలు నీటమునిగి రైతులు కన్నీళ్లు మున్నీళ్లు పెడుతున్నారు. తొర్రూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వీరగాని శీను అనే రైతు తీవ్రంగా నష్టపోయాడు. తుఫాన్ కారణంగా చేతికొచ్చిన వరి పంట నేల కొరవడంతో రైతు ఆవేద చెందుతున్నాడు. సుమారు నాలుగున్నర ఎకరాల మేరకు వరి సాగు పూర్తిగా వర్షానికి దెబ్బతిన్నదని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరుతున్నాడు. ప్రభుత్వమే పంట నష్టాన్ని అంచనా వేసి నష్టపరిహారం ఇవ్వాలి అని అన్నారు.

## కార్మిక హక్కులు కాలరాస్తున్న పాలకవర్గాలు

**సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి**



**కురవి, విశాలభారతి:** బహుళ జాతి సంస్థల కార్పొరేట్లకు దాసోహమై కార్మిక హక్కులను కాలరాస్తున్న పాలకవర్గాల విధానాలపై కార్మిక రంగం సంఘటిత ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాల సందర్భంగా కార్మిక నాయకుడు బొల్లం ఉప్పలయ్య అరుణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని, స్వాతంత్ర పోరాటంలో పాల్గొని, స్వాతంత్ర అనంతరం పాలకవర్గాలు అవలంబించే కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించి, 8గంటల పనివిధానం, 44 రకాల కార్మిక చట్టాలను సాధించిన ఘనత అని, కార్మిక వర్గం పోరాటలతో సాధించుకున్న చట్టాలు మోదీ అవలంబించే కార్పొరేట్ల అనుకూల విధానాల వలన కార్మిక రంగం ప్రమాదంలో పడిందని, ఈ నేపథ్యంలో కార్మికులు సంఘటిత ఉద్యమాలతో హక్కుల రక్షణ కోసం కదలాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, బుర్ర సమ్మయ్య తురక రమేష్, కలగూర నాగరాజు, అప్పల వెంకన్న, బొల్లం అనిల్, వెంపటి ఉదయ్, బాలాజీ, చందు, ప్రవీణ్, బొబ్బిలి, మధు, బొడ్డు ఉదయ్, పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ జన్మదిన వేడుకలు



**మహబూబాబాద్, విశాలభారతి:** మాజీ మంత్రివర్యులు సత్యవతి రాథోడ్ జన్మదినాన్ని డోర్నకల్ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. సోమజిగూడలోని ఆమె నివాసంలో సత్యక్కతో కలిసి కేక్ కట్ చేయించి పూలమాలలు వేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్యు ప్యాట్నీ, బండ బిక్షం రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, జీవన్, నరేష్, ఆర్యన్ జైన్ తదితరులు పాల్గొన్నారు. సత్యవతి రాథోడ్ రాష్ట్ర రాజకీయాల్లో మహిళలకు ఆదర్శంగా నిలిచారని, ఆమె ప్రజాసేవ ధ్యేయం తమకు ప్రేరణగా ఉందని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ— "సత్యక్క గిరిజన సమాజం అభ్యున్నతికి, మహిళల సాధికారతకు చేసిన కృషి మరువలేనిది. ఆమెకు దీర్ఘాయుష్షు, ఆరోగ్యం లభించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాం" అన్నారు. జన్మదిన వేడుకలో బిఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని "జయహో సత్యక్క" నినాదాలతో మార్మోగించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించిన అదనపు కలెక్టర్



**తిరుమలగిరి, విశాలభారతి:**

తిరుమలగిరి మండలం లోని రాజన్న కొక్య నాయక్ తండా మరియు తొండ గ్రామాలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ సీతారామరావు,డిర్ డి వో, డి సీ ఎస్ వో తహసీల్దార్ తిరుమలగిరి తో కలిసి వర్షం వలన తడిసిన ధాన్యము రాశుల ను పరిశీలించి నారు.తడిసిన ధాన్యము మరియు తేమ శాతం వచ్చిన ధాన్యం ను వెంటనే కాంటాలు వేసి మిల్లు శ్రీ సాయిరాం రైస్ మిల్లు సూర్యాపేట కు పంపవలసిన దిగా ఆదేశించారు. వీరి వెంట పీడీ అప్పారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి మోహనబాబు, పంచాయతీ అధికారి యాదగిరి తహసీల్దార్ హరిప్రసాద్ ఏవో నాగేశ్వర్ రావు, ఎంపీడీఓ లాజర్ సీసీ నాగయ్య జీపీవో మధుసూదన్, నాగలక్ష్మి డీటీ లు రాజశేఖర్, శ్రీధర్ రెడ్డి లతో నిర్వాహకులు పాల్గొన్నారు.

## తుఫాను ధాటికి రైతులకు తీవ్రనష్టం



- తీవ్ర తుఫాన్ వల్ల రైతులకు కలిగిన పంట నష్టాన్ని
- అధికారులు అంచనాలు ప్రభుత్వానికి
- పాల్వంచ మండలంలో పర్యటించి దెబ్బతిన్న పంటను పరిశీలించిన కొత్వాల

పాల్వంచ, విశాలభారతి: ఇటీవల మొంథా తుఫాన్ ధాటికి రైతులకు తీవ్ర పంట నష్టం వాటిల్లింది పంట నష్టాన్ని అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్,డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పాల్వంచ సొసైటీ అధ్యక్షులు,కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.శుక్రవారం పాల్వంచ మండలంలోని పలు గ్రామాల్లో కొత్వాల పర్యటించారు.సంగెం, నారాయణరావు పేట,గ్రామాల్లో నీట మునిగిన వరి పంటకు జరిగిన నష్టాన్ని పరిశీలించారు.వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ మొంథా తుఫాన్ రాష్ట్రంలోని రైతులను నట్టేట ముంచిందన్నారు.అకాల వర్షంతో చేతికి అందిన వరి,పత్తి,మిర్చి పంటలు దెబ్బతిన్నాయన్నారు.తెలంగాణ రైతాంగం పండించిన పంట అకాల వర్షం కారణంగా తడిసి ముద్దయిందన్నారు. చేతికొచ్చిన వరి,పత్తి,మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని అన్నారు.వ్యవసాయ,రెవెన్యూ శాఖల అధికారులు సర్వే చేసి పంట నష్టాన్ని అంచనాలు వేయాలని అన్నారు.తద్వారా ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలన్నారు.పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని చూపించారు అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ చౌగాని పాపారావు,పెద్దమ్మ గుడి డైరెక్టర్ భూక్య గిరి ప్రసాద్, పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పైడిపల్లి మహేష్,కాంగ్రెస్ నాయకులు ఉండేటి శాంతి వర్ధన్, గంగుల వెంకటేశ్వర్ రెడ్డి,బెల్లం మల్లేష్,రైతులు నేలపట్ల శ్రీనివాస్ రెడ్డి,మట్ట చిన్న సీతారాం రెడ్డి, జర్పుల లక్ష్మయ్య ,గుర్రం హుస్సేన్, ఇంగాలపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం



**రాజేంద్రనగర్, విశాలభారతి:** ఏఐటి యూసి 106 వ ఆవిర్భావ వేడుకలు గండిపేట్ మండలంలోని మణికొండ మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్నఏఐటి యూసి రంగారెడ్డి జిల్లా కార్యదర్శి, ఏఐటియూసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎస్. మల్లేష్ సీనియర్ నాయకులు ఎం శంకరయ్య మాట్లాడుతూ.. 1920 అక్టోబర్ 31 న దేశంలో ఏఐటియూసి ఆవిర్భవించిందన్నారు. కార్మికులకు, కష్టజీవులకు అండగా.. దోపిడీదారులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని, సంఘటిత అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు రూ 26.000 నిర్ధారించి అమలు చేయాలన్నారు.. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జెండా ఆవిష్కరణలో ఎం. బాబురావు బి ఓ సి మండల కార్యదర్శి శ్రీకాంత్ ఏఐటి యూసి నాయకులు ప్రకాష్ శ్రీరాము ప్రభు లక్ష్మి మా దేవి చిన్న రాము లక్ష్మణ్ రమేష్ నాయకులు పాల్గొన్నారు.

## దళారులకు దూరంగా ఉండండి

**ప్రభుత్వకేంద్రాలకేధాన్యంఇవ్వండి-ఎమ్మెల్యే**

**అశ్వరావుపేట, విశాలభారతి:** రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే ధాన్యం తీసుకురావాలని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సూచించారు. దమ్మపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఖరీఫ్ 2025-26 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. సన్న రకం వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందజేస్తున్నట్లు వెల్లడించారు. రైతులు ఎలాంటి ఆందోళన లేకుండా సమీప ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకురావాలని సూచిస్తూ, మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పించబడతాయని అన్నారు. ధాన్యం తూకం, చెల్లింపులు పూర్తిగా పారదర్శకంగా జరుగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, కమిటీ సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.





# నందమూరి వారసుడు వెనకడుగు.. కూతురు ముందడుగు!

నందమూరి బాలకృష్ణ అభిమానులంతా ఆనందపడే క్షణాలు వచ్చేశాయి. మహానటుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు (నట వారసుడిగా బాలకృష్ణ సినిమా రంగంలోకి అడుగుపెట్టి యాభై సంవత్సరాలైపోయింది. ఇప్పుడు అందరూ బాలకృష్ణ నట వారసులుగా ఎవరు తెరంగేట్రమ్ చేస్తారా అని ఎదురుచూస్తున్నారు. బాలకృష్ణ తన కొడుకు మోక్షజ్ఞ త్వరలో హీరోగా తెరంగేట్రమ్ చేస్తారని చెప్పారు. ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో మోక్షజ్ఞ హీరోగా సినిమా చేస్తున్నామనీ ప్రకటించారు. కానీ కారణాలు ఏవైనా ఆ సినిమా పట్టాలెక్కలేదు. దాంతో నందమూరి బాలకృష్ణ అభిమానులంతా డీలా పడిపోయారు. మోక్షజ్ఞ ఎంట్రీ ఎప్పుడెప్పుడు ఉంటుందా? అని ఎంతో ఆతృతతో ఎదురు చూస్తున్నారు. అయితే వారెవ్వరూ ఊహించని స్వీట్ సర్ ప్రైజ్ నందమూరి బాలకృష్ణ చిన్న కూతురు తేజస్విని నుండి వచ్చింది.నందమూరి బాలకృష్ణ బాటలో చిత్రసీమలోకి అడుగుపెట్టిన తేజస్విని కొంతకాలంగా ప్రొడక్షన్ వ్యవహారాలను చూస్తోంది. 'ఆహా' లో ప్రసారం అవుతున్న బాలకృష్ణ అన్ స్టాపబుల్ షో తో పాటుగా ఆయన నటించే సినిమాల నిర్మాణాన్ని దగ్గర ఉండి చూసుకుంటోంది. అయితే మరో విశేషం ఏమంటే... ఇప్పటి వరకూ తెర వెనుక ఉన్న తేజస్విని ఇప్పుడు కెమెరా ముందుకు వచ్చేసింది. నందమూరి బాలకృష్ణ చాలా కాలం వాణిజ్య ప్రకటనలకు దూరంగా ఉంటూ వచ్చారు. అయితే బసవతారకం కాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన మనసు మార్చుకుని వాణిజ్య ప్రకటనలు చేయడం మొదలు పెట్టారు. తద్వారా వచ్చిన రెమ్యూనరేషన్ ను హాస్పిటల్ అభివృద్ధి కోసం ఖర్చుపెట్టడం మొదలు పెట్టారు. ఆ నోబుల్ కాజ్ ఇప్పుడు తేజస్విని సైతం కెమెరా ముందుకు వచ్చేలా చేసి ఉండొచ్చు. ఆమె ప్రముఖ ఆభరణాల సంస్థకు బ్రాండ్ అంబాసిడర్ గా అరంగేట్రమ్ చేసింది. ఆమె భర్త, మతుకుమల్లి భరత్ ప్రస్తుతం విశాఖ పట్నం పార్లమెంట్ సభ్యుడిగా సేవలు అందిస్తున్నారు. ఆయన విద్యావేత్త కూడా.సిద్ధార్థ ఫైన్ జ్యువెలర్స్ తో తేజస్వినికి ఉన్న అనుబంధం, నందమూరి కుటుంబానికి, తెలుగు సినిమా అభిమానులకు సంతోషకర ఘట్టంగా నిలిచింది. ఆ సంస్థకు బ్యాండ్ అంబాసిడర్ గా చేస్తూ తేజస్విని కళాత్మక ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. ఈ వాణిజ్య ప్రకటనలో తేజస్విని కనిపించిన తీరు, ఆమె ఆత్మవిశ్వాసం, గ్రేస్ నందమూరి అభిమానులను కట్టిపడేస్తోంది. ఇంతటి ఛార్మ్ ఉన్న అమ్మాయి సినిమాల్లో నటించి ఉంటే ఎంత బాగుంటుంది! అనుకుంటున్నారు నందమూరి అభిమానులు. తాత, తండ్రి నుండి నటనా వారసత్వాన్ని తేజస్విని సంపూర్ణంగా అందిపుచ్చుకుందని వారు అభిప్రాయపడుతున్నారు. కథానాయికగా కాకపోయినా తేజస్విని తనకు నచ్చిన, తనకు తగ్గ పాత్రలను సిల్వర్ స్క్రీన్ మీద చేస్తే వారంతా చూడాలని అనుకుంటున్నారు. మరి ఆమె నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి.



# సెన్సేషనల్ బుకింగ్స్ తో "బాహుబలి ది ఎపిక్"

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు ఎస్ ఎస్ రాజమౌళి కలయికలో తెరకెక్కించిన ఎపిక్ హిస్టారికల్ చిత్రం బాహుబలి సిరీస్ కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమాలని రెండింటిని కలిపి ఒక్క సినిమాగా బాహుబలి ది ఎపిక్ అంటూ రీరిలీజ్ కి తీసుకొస్తే దీనికి మళ్లీ పాన్ ఇండియా సహా యూఎస్ మార్కెట్ లో అదిరే రెస్పాన్స్ వస్తుంది. ఇక ఈ సినిమా బుక్ మై షో బుకింగ్స్ లో అదరగొడుతుంది.ఇన్ని రోజులు ప్రీ సేల్స్ తో పాటుగా నిన్న ఒక్క 30 తారీఖు సేల్స్ లక్ష టికెట్స్ కి పైగా అమ్ముడుపోయాయని తెలుస్తోంది. ఇలా కేవలం ప్రీ సేల్స్ లోనే బాహుబలి ది ఎపిక్ సినిమా 3లక్షలకు పైగా టికెట్ లని సేల్ చేసుకున్నట్లు తెలుస్తోంది. ఇక ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ నేడు కాగా ఈరోజు కూడా హావర్లీ బుకింగ్స్ లో బాహుబలి ట్రెండ్ అవుతుంది. మరి ఫైనల్ రన్ లో బాహుబలి ఎక్కడ వరకు వెళ్లి ఆగుతుందో చూడాలి.



# షారూఖ్ ఖాన్ షష్టిపూర్తి వేడుకలు

బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ 60వ పుట్టినరోజు వేడుకలకి సమయం ఆసన్నమైంది. నవంబర్ 2న తన షష్ఠిపూర్తిని జరుపుకోనున్న ఆయన ఈసారి అభిమానులను ఆశ్చర్యపరుస్తూ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాధారణంగా ప్రతి సంవత్సరం ముంబైలోని తన నివాసం 'మన్నత్' ముందు అభిమానులను పలకరించే షారుఖ్ ఖాన్, ఈసారి మాత్రం అక్కడ పుట్టినరోజు వేడుకలు జరుపుకోరు. కారణం ప్రస్తుతం మన్నత్ భవనంలో రిపేర్ మరియు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. అందువల్ల ఈసారి పుట్టినరోజు వేడుకలు అలీబాగ్‌లోని ఆయన ఫార్మ్‌హౌస్‌లో జరుగనున్నాయి.ఈ వేడుకకు బాలీవుడ్ స్నేహితులు, కుటుంబ సభ్యులు, అలాగే కొంతమంది సౌత్ సినీ ప్రముఖులను కూడా ఆహ్వానించినట్టు సమాచారం. నవంబర్ 1 నాటికి అతిథులు అలీబాగ్ చేరుకుంటారని తెలుస్తోంది. సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్‌లతో పాటు అంబానీ కుటుంబ సభ్యులు కూడా ఈ వేడుకలో పాల్గొనే అవకాశం ఉంది. టాలీవుడ్ నుండి చిరంజీవి, రామ్ చరణ్‌తో పాటు పలువురు ప్రముఖులకి కూడా ఆహ్వానం అందించనట్టు సమాచారం. ఇక షష్ఠిపూర్తి సందర్భంగా అభిమానులకు షారుఖ్ ఖాన్ ప్రత్యేక గిఫ్ట్ సిద్ధం చేశారు. ఆయన నటిస్తున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కింగ్' ఫస్ట్ లుక్ నవంబర్ 2న విడుదల కానుంది. దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో హింట్ ఇచ్చారు. ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌తో పాటు అభిషేక్ బచ్చన్, రాణి ముఖర్జీ, దీపికా పదుకొనే, సుహానా ఖాన్, అనిల్ కపూర్, అర్షద్ వార్సీ, అభయ్ వర్మ, జైదీప్ అహ్లావత్, రాఘవ్ జుయల్ తదితరులు నటిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ చిత్రం అక్టోబర్ 2026లో గాంధీ జయంతి వారాంతంలో విడుదల కానుందని సినీ వర్గాల సమాచారం. ఈసారి షారుఖ్ పుట్టినరోజు వేడుకలు కేవలం బాలీవుడ్‌కే కాదు, సౌత్ సినీ ఇండస్ట్రీకి కూడా ప్రత్యేకంగా మారబోతున్నాయి. కొన్నాళ్లుగా షారూఖ్ నుండి బ్లాక్ బస్టర్స్ రావడం లేదు. మరి ఈ సారి బడా హిట్ తో ప్రేక్షకులకి మంచి కిక్ ఇస్తాడా అనేది చూడాలి.

# మలయాళ ఇండస్ట్రీ బ్లాక్‌బస్టర్ కొత్త లోక..

సినిమా థియేటర్లలో విడుదలై సంచలన విజయం సాధించిడంతో పాటు పాత రికార్డులను చెరిపి వేసి సరికొత్త చరిత్ర సృష్టించిన మలయాళ చిత్రం లోకా తెలుగులో కొత్త లోకాగా వచ్చింది. కేవలం పాతిక కోట్ల బడ్జెతో తెరకెక్కిన ఈ చిత్రం ఆగస్టు చివరి వారంలో థియేటర్లలో విడుదలై ప్రపంచ వ్యాప్తంగా రూ.300 కోట్లను రాబట్టి కేరళ సినిమా చరిత్రలో సరికొత్త అధ్యాయం లిఖించింది. ఇప్పటివరకు మోహన్ లాల్ పేరిట మాత్రమే ఉన్న నాలుగైదు రికార్డులను చెరిపేసి కేరళ ఆల్‌టైం బ్లాక్ బస్టర్‌గా, హయ్యస్ట్ మలయాళ గ్రాసర్‌గా ప్రథమ స్థానంలో నిలిచింది. అలాంటి ఈ చిత్రం ఎట్టకేలకు మూడు నెలల లాంగ్ గ్యాప్ తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసిందికథ విషయానికి వస్తే.. రాజుల కాలంలో ఓ గిరిజన ప్రాంతంపై సమీప రాజు దాడి చేసి అక్కడి ప్రజలపై మారణకాంగడ సృష్టిస్తాడు. ఆ సమయంలో వారి నుంచి తప్పించుకున్న నీల అనే బాలిక ఫ్యామిలీ ఓ కొండ గుహాలో తలదాచుకుంటారు. అక్కడ నీల విరిగిపోయిన అమ్మవారి విగ్రహాన్ని చూసిన తర్వాత అతీంద్రియ శక్తులు పొంది అప్పటి నుంచి ఇమ్మోర్టల్ అవుతుంది. తనకు లభించిన శక్తులను మంచి కోసం మాత్రమే వినియోగిస్తూ కాలం వెళ్లదీస్తుంది. దేశదేశాలు తిరుగుతూ తను గురువుగా భావించే వ్యక్తి కనుసన్నలో జీవిస్తూ ఉంటుంది. కొన్ని శతాబ్దాల తర్వాత నీల తనకు వచ్చిన ఆదేశాల మేరకు బెంగళూరులో చంద్ర పేరుతో జీవిస్తూ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తూ ఉంటుంది. అదే అపార్ట్‌మెంట్‌లో ఉండే సన్నీ చంద్రను ప్రేమిస్తూ ఉంటాడు. అయితే.. కానీ నగరంలో అవయవాల అక్రమ రవాణా మాఫియాను చూసిన తర్వాత చంద్ర జీవితం మారిపోతుంది. సూపర్ పవర్స్ ఉన్న ఈమె ఈ మాఫియాను ఎలా ఎదుర్కొంది? ఆమె రహస్యమైన గతం ఏంటి? అనే మిస్టరీ సినిమాకి బలం. విజువల్స్, యాక్షన్ సీన్స్ మేస్మరైజ్ చేస్తాయి. అయితే.. ఈ మూవీ ప్రథమార్థం ఆసక్తికరంగా ఉన్నా... సెకండాఫ్‌లో టొవినో థామస్ ఎంట్రీ, సౌబిన్ షాహిర్ గెస్ట్ రోల్, క్లయిమాక్స్ లో దుల్కర్ సల్మాన్ గెస్ట్ అప్పీరియన్స్ ఇవ్వడం వీక్షకులను గజిబిజికి గురి చేస్తుంది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No - APTEL/2010/32877.